# ఉద్యమాల గడ్డ గులాబీ అడ్డా

- దుబ్బాకలో ఎగిరేది 'గులాబీ' జెండానే
- అభివృద్ధి నాది.. ఎన్నికలో మెజార్టీ మీది
- బీజేపీ అధర్మంపై.. బీఆర్ఎస్ యుద్ధం
- బీఆర్ఎస్‌కు బలం.. బలగం పార్టీ శ్రేణులే..
- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను చేసుకుందాం
- బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకలో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం



దుబ్బాకలో నియోజకవర్గ పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, అక్టోబర్ 25 : ఉద్యమాల గడ్డ దుబ్బాకలో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎందరో ఉద్యమకారులు త్యాగాలు చేశారని, పోలీసు కేసులు, జైలు జీవితాలను అనుభవించారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్‌కు దుబ్బాక అంటే ఎనలేని మమకారం అన్నారు. బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం, బలగమన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, బూత్ కమిటీ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులకు ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలు, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకపై ఉన్న మమకారంతోనే సీఎం కేసీఆర్ ఈ ప్రాంత బిడ్డనైనా తనను ఆశీర్వదించి అభ్యర్థిగా పంపించారని, ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ అందించి సీఎంకు కానుకగా ఇద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ సారును రెండుసార్లు సీఎంగా ఎన్నుకున్నామని, ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను చేసుకుందామని పిలుపునిచ్చారు. హనుమంతుడి లేని ఊరైనా ఉండోచ్చు కానీ కేసీఆర్ సంక్షేమ పథకం అందుకోని ఇల్లు లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని సూచించారు. వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిగా ఉంటూ పార్టీ నాయకులు ప్రజలతో నిత్యం మమేకం కావాలని సూచించారు. పదవుల కోసం ఆరాటపడుతున్న బీజేపీ, కాంగ్రెస్‌కు చరమగీతం పాడాలని ఆయన కోరారు.

### దుబ్బాక అభివృద్ధి నాది.. ఈ ఎన్నికలో మెజార్టీ మీది

దుబ్బాక అభివృద్ధి పూర్తిగా నాదేనని, ఈ ఎన్నికల్లో మెజార్టీ మీదేనని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వాటిని నమ్మొద్దన్నారు. సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలతో సమానంగా దుబ్బాకను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

తనను రెండుసార్లు ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపించారని, ఇప్పుడు అదే అభిమానంతో భారీ మెజార్టీ అందించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఈ ఎన్నికలు బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ అవలంభించిన అధర్మం, అవాస్తవాలపై బీఆర్ఎస్ చేస్తున్న యుద్ధమని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. గత ఉపఎన్నికల్లో నోటికొచ్చిన హామీలిచ్చి దుబ్బాక ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని అసమర్థత ఎమ్మెల్యేగా రఘునందన్ చరిత్రలో నిలిచిపోయాడని ఎద్దేవా చేశారు. ఉసరవెల్లి రాజకీయాలు చేస్తున్న రఘునందన్‌కు ఈ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దుబ్బాక నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉన్నదని ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు అన్నారు. గత ఉపఎన్నికల్లో దుబ్బాకలో బీజేపీది గెలుపు కాదని, ఈ ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంతో పనిచేసి, భారీమెజార్టీతో కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మూ డోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమ గడ్డ దుబ్బాకలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు.



దుబ్బాక టౌన్ : దుబ్బాకలో జరిగిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సమావేశంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు



చిలిపిచెడ్: చిట్కుల్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

## నిర్భయంగా ఓటు వేయాలి

- నర్సాపూర్ సీఐ షేక్ లాల్ మదర్

చిలిపిచెడ్, అక్టోబర్ 25: ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని నర్సాపూర్ సీఐ షేక్ లాల్ మదర్ తెలిపారు. బుధవారం చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్, చండూర్, చిలిపిచెడ్‌లో జిల్లా పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామాల్లో ప్రధాన చౌక్ వీదుగా కేంద్ర బలగాలైన రెండు కంపెనీల బీఎస్ఎఫ్, ఆర్ఐ సిబ్బంది, స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ, హోంగార్డుతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ సీఐ షేక్ లాల్ మదర్ మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల ఆదేశాల మేరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్, కౌడిపల్లి, చిలిపిచెడ్ ఎస్సైలు శివకుమార్, శివప్రసాద్‌రెడ్డి, షేక్ మహబుబ్, ఏఎస్సైలు మిస్బోద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.




దామరచెర్వు హైవే చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రంజిత్

## తనిఖీలో రూ.50,200 పట్టివేత

రామాయంపేట, అక్టోబర్ 25: దామరచెర్వు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఓ కారులో రూ. 50,200లు లభ్యమైనట్లు రామాయంపేట ఎస్సై.రంజిత్ తెలిపారు. బుధవారం రామాయంపేట జాతీయ రహదారిపై చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీని చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో దామరచెరువు చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి కారులో లభ్యమైన రూ.50,200 నగదుకు సరైన పత్రాలు చూపకపోవడంతో డబ్బులను మెదక్ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో డిపాజిట్ చేసి సంబంధిత బ్యాంకు వోచర్‌ను ఎన్నికల మానిటరింగ్ ఎక్సెపెండీచర్‌కు అప్పగించినట్లు ఎస్సై.రంజిత్ వెల్లడించారు.



చెట్లతిమ్మాయిపల్లిలో బెల్ట్ షాప్‌లపై దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

## బెల్ట్ షాప్‌లపై దాడి..

చేగుంట, అక్టోబర్ 25: బెల్ట్ షాప్‌లపై దాడి చేసి అక్రమంగా నిలువ ఉంచిన మద్యంను స్వాధీనం చేసుకున్న ఘటన చేగుంట మండలం చెట్లతిమ్మాయిపల్లిలో బుధవారం జరిగింది. రామాయంపేట ఎక్సైజ్ సీఐ జయసుధ కథనం ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు గ్రామంలోని బెల్ట్ షాప్‌లపై దాడి చేయగా చెట్లతిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్‌గౌడ్ వద్ద 24 లీటర్లు మద్యం పట్టుకున్నామని, వీటి విలువ సుమారు రూ.30 వేలు వరకు ఉంటుందన్నారు. ఈ దాడిలో ఎస్ఐ విజయ్ సిద్ధార్థ, సిబ్బంది దుర్గారెడ్డి, రాకేశ్, రజిత, వేణు తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడి జన్మదిన వేడుకలు

రామాయంపేట, అక్టోబర్ 25: రామాయంపేట పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్ గజవాడ నాగరాజు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం రామాయంపేట బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి, నాగరాజును శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, మాజీ సర్పంచ్ ప్రభావతి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- దసరా సంబురాలు




మెదక్: జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవై జమ్మికుంట కాలనీలో దసరా సంబురాల్లో కాలనీవాసులు

## కనుల పండువగా శోభాయాత్ర

మెదక్ రూరల్/పెద్దశంకరంపేట, అక్టోబర్ 25: దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని మెదక్ జిల్లా కేంద్రంలో కుమ్మరిగడ్డ దుర్గమాత అమ్మవారి శోభాయాత్ర మంగళవారం రాత్రి కనుల పండువగా సాగింది.గ్రామంలో పురవీధుల్లో, మహిళలు, చిన్నారులు నృత్యాలు చూస్తూ అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. అనంతరం కోంటూరు చెరువులో నిమజ్జనం చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దశంకరంపేటలోని తిర్మలాపురం, రాణి శంకరమ్మ గడికోటలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను బుధవారం తిరుమలాపురం చెరువులో నిమజ్జనం చేశారు. స్థానిక రాణి శంకరమ్మ గడికోటలో గడికోట ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, తిరుమలాపురంలో ఆర్య వైశ్య సంఘం, శిశుమందిర్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శోభాయాత్ర నిర్వహించి తిరుమలాపురం చెరువులో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



మెదక్ పట్టణంలో అమ్మవారి శోభాయాత్ర..



పెద్దశంకరంపేట: తిరుమలాపురం చెరువులో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



మెదక్: అమ్మవారి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువతులు